క్లుప్తంగా

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

జియ్యమ్మవలసరూరల్: మండలంలోని కుదమ పంచాయతీ, గౌరీపురం–కుదమ, గౌరీపురం–తోటపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా పాడైందని, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదే రోడ్డు మీదుగా పరజపాడు, లక్ష్మీపురం, పెదకుదమ, చినకుదమ, కుందరతిరువాడ, నీచుకవలస గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా, రోడ్డు బాగా లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రోడ్డు వేయకపోయినా ఫర్వాలేదు గానీ రోడ్డు బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాల వార్షికోత్సవం

వీరఘట్టం: స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం జరిగింది. పాఠశాల చిన్నారులు తమ ఆటపాటలతో అలరించారు. హెచ్ఎం దన్నాన నారాయణరావు, ఉపాధ్యాయుడు బొమ్మాళి బాబూరావు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఇసుక లారీ స్వాధీనం

కొమరాడ: మండలంలోని కూనేరురామభద్రపురం, కొమరాడ, కొట్టు, కొరిశీల, నిమ్మలపాడు, కళ్లికోట ప్రాంతాల్లోని నాగావళి నదీ తీరంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని మంగళవారం సాక్షి దినపత్రికలో 'ఇసుక తవ్వేస్తున్నారు..' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా మైనింగ్ అధికారుల బృందం ఆకస్మికంగా కూనేరురామభద్రపురం ఇసుక ర్యాంప్‌ను తనిఖీ చేసి, ఓ ఇసుక లారీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదే విషయాన్ని స్టేషన్ రైటర్ రాజారత్నం తెలిపారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వృత్తి విద్య కోర్సులు చేసిన వారికి ఉపాధి అవకాశాలు అపారమని కురుపాం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి తెలిపారు. అదే పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆమె చేతులమీదుగా మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థులకు ఉపాధి, స్వయం ఉపాధి కలిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందని, ఉన్న అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జర్నలిస్టుల ఐక్యత కోసం సంఘాలు అవసరం

సాలూరు: జర్నలిస్టుల ఐక్యత కోసం సంఘాల అవసరం ఉందని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం సాలూరు పట్టణంలో సీనియర్ జర్నలిస్టు కోట్ల లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి జర్నలిస్టుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, అక్రిడిటేషన్లు, ఇళ్లస్థలాలు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మహాసభలు విశాఖపట్నంలో నిర్వహించే అవకాశం ఉందని, జర్నలిస్టులపై దాడుల నేపథ్యంలో అందరం సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సింహాద్రి, ఇతర జర్నలిస్టులు శంకరరావు, శ్యాం, రామారావు, జార్జ్, ఈశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇంటి అవసరాల నిమిత్తం వినియోగించాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు హోటళ్లకు సరఫరా అవుతున్నాయన్న ఫిర్యాదుల మేరకు వెలమ వీధిలోని డాల్ఫిన్ హోటల్‌లో అధికారులు సోదాలు చేశారు. మూడు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టు జంక్షన్ వద్ద జేసీ ఫిల్లింగ్ స్టేషన్‌కు వెళ్లి, పెట్రోలు, డీజిలు నాణ్యత, కొలతలు పరిశీలించారు. అంతా బాగానే ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

సంతకవిటి: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ హెచ్ ఉపేంద్రరావు సూచించారు. మండలంలోని బొద్దూరులో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన గంజాయి

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం సమీపంలో తోటపల్లి కాలువ వద్ద మంగళవారం జరిపిన వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 1.126 కేజీల గంజాయి పట్టుకున్నామని ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. గడిముడిదాం గ్రామానికి చెందిన కలివరపు సురేష్‌కుమార్, వీరఘట్టం మండలం, కత్తులకవిటికి చెందిన కొత్తవలస లోకేష్‌లు అనుమానాస్పదంగా కాలువ వద్ద ఉన్నారు. వారి వద్ద తనిఖీ చేయడంతో వారి బ్యాగులో గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ప్రస్తుతం వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అధికారులంతా శాఖల వారీగా తమ ప్రగతి నివేదికలను ప్రజాప్రతినిధులకు చదివి వినిపించారు. దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే ఆస్పత్రికి వచ్చే రోగుల పూర్వ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు అబా ఐడీని రూపొందించడం జరుగుతోందన్నారు. మలేరియా, డెంగీ తదితర జ్వరాల బారినపడకుండా గ్రామస్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. రాత్రి పడుకునేటప్పుడు దోమతెరలు వాడాలని సూచిస్తున్నామని, త్వరలోనే దోమల నివారణ మందు పిచికారీ పనులు కూడా చేపడతామన్నారు. ఎంఈవో బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలానికి 28 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీనికి ప్రజాప్రతినిధుల నుంచి కూడా సహకారం కావాలన్నారు. పి.ఆమిటి, బొద్దిడి, దుమ్మంగి గ్రామాల్లో మూతపడిన పాఠశాలలు జూన్ నుంచి మళ్లీ ప్రారంభమవుతాయన్నారు. వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ 50 శాతం రాయితీపై గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ఇచ్చేందుకు సిద్ధం చేశామన్నారు.

14 వారాల వేతన బకాయిలు..

ఉపాధి హామీ పథకం ఈసీ మాట్లాడుతూ 14 వారాలకు సంబంధించిన వేతన బకాయిలు వేతనదారులకు చెల్లించాల్సి ఉందని, రెండు, మూడు రోజుల్లో చెల్లించే అవకాశం ఉందన్నారు. పి.ఆమిటి ఎంపీటీసీ సభ్యురాలు బృందావతి మాట్లాడుతూ పి.ఆమిటి బాలికల ఆశ్రమ పాఠశాలలో యూనిఫాం కుట్టు చార్జీల పేరిట విద్యార్థినుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలియవచ్చిందని దానిపై దృష్టి సారించాలని ఏటీడబ్ల్యూవోకు సూచించారు. గొయిపాక సర్పంచ్ మాట్లాడుతూ ఏజెన్సీలో పూర్వ నుంచి నివశిస్తున్న గిరిజనేతరులకు కూడా ఇంటి పొజిషన్ సర్టిఫికెట్‌తో పాటు ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావును కోరారు. గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకరరావు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, మండ గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేల భవన నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయని, అయితే వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపులు నేటికీ జరగలేదన్నారు. ఆయా కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారి బిల్లులు చెల్లించాలని పీఆర్ ఏఈ కె.మురళీధర్‌కు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే ఏ అభివృద్ధి పని గూర్చి అయినా స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్‌లకు అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయుల నియామకాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, ఎంపీడీవో ఎస్.సాల్మన్ రాజు, తహసీల్దారు ఎస్.శేఖర్ పాల్గొన్నారు.

ఒకేషనల్ ధ్రువపత్రాల పంపిణీ



ధ్రువపత్రాలతో ఒకేషనల్ విద్యార్థులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఒకేషనల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు మంగళవారం పంపిణీ చేశారు. గత 12 రోజులుగా ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి గ్రామాల్లో ఇంటర్న్‌షిష్ పూర్తి చేసిన 69 మందికి ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీఎంసీ చైర్మన్ వానపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ మండల ధనలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు చేతుల మీదుగా అందించారు. ఒకేషనల్ టీచర్లు సీహెచ్ హరిప్రసాద్, కె.మాధవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు బీసు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడజమ్ము పంచాయతీ, పాములగీసాడ గ్రామంలో క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ నాయకుడు పత్తిక బీసు ప్రారంభించారు. క్రీడలు శారీరక ఆరోగ్యానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ప్రతిఒక్కరూ ఆటలో గెలుపోటములు పక్కనబెట్టి క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. కార్యక్రమంలో యువకులు రమేష్, వెంకటరావు, సుబ్బారావు, చిరంజీవి, బుజ్జిబాబు, గణేష్, నాయకులు భీమారావు, మోహన్‌రావు, ఆనంద్, చిన్నారావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భామినిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



బత్తిలిలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ

భామిని: జిల్లా ఇంచార్జ్ విద్యాశాఖాధికారిణి రామజ్యోతి ఆధ్వర్యంలో భామిని మండలంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ మంగళవారం చేశారు. కొత్తగా అంగన్‌వాడీ నుంచి ఒకటో తరగతి జాయిన్ అయ్యే పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఎంఎంపీఎస్ బత్తిలి, ఎంపీయూపీఎస్ నేరడులో చేర్పించారు. ఐదో తరగతి పూర్తి చేసిన వారిని బత్తిలి జెడ్పీహెచ్ఎస్‌లో జాయిన్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, వి.భాస్కరరావు, హెచ్ఎంలు వెంకటరమణ, సీఆర్‌పీ చిన్నబాబు పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద తయారు చేయాలి



పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో మాట్లాడుతున్న డీపీఓ ఎస్ కొండలరావు

సీతానగరం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా ఎరువు తయారుచేయడానికి ప్రాధాన్యం ఇచ్చి పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు తోడ్పడాలని డీపీఓ కొండలరావు ఆదేశించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని సూరంపేట, గుచ్చిమి, పెదబోగిలి ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణను ఈఓపీఆర్డీ కె.కుమార వర్మతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూరంపేట పంచాయతీ పరిధిలో ఉన్న చిన్నారాయుడుపేట, మరిపివలస, సూరంపేట గ్రామాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రీన్‌అంబాసిడర్లు వీధుల్లో సేకరించిన తడిచెత్త, పొడిచెత్తను ఎస్‌డబ్ల్యూపీసీల్లో వేరుచేసిన చెత్తను ఎరువుగా ఉత్పత్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని, ఎరువు తయారీకి అసరమైన వనరులు వేతనదారులను ప్రత్యేకించామని తెలిపారు. పంచాయితీ కార్యదర్శులు గ్రీన్‌అంబాసిడర్లతో చెత్తనుంచి సంపద తయారీకి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే సూరంపేట వీధుల్లో నిర్వహించిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెవిటమ్మ తల్లికి పూజలు

భామిని: మండలంలోని కొత్తపసుకుడిలో వెలసిన చెవిటమ్మ తల్లికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవత సంబరాల నిర్వహణలో భాగంగా ముందుగా ముగ్రాటలతో తల్లికి అభిషేకించారు. ఎజ్జోడుతో కలిసి గ్రామదేవత సంబరాలకు అనుమతి పూజలు నిర్వహించారు.

ఉపాధి వేతనదారుల ధర్నా



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ఉపాధి వేతనదారులకు చెల్లించవలసిన బిల్లుల బకాయిలు చెల్లించనందుకు నిరసనగా చినభోగిలి సచివాలయం ఎదుట వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 2వ వారం నుంచి వేతనదారులకు పనులు కల్పించినా బిల్లులు నేటికీ చెల్లించక పోవడంతో పనులు చేసినా వారికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదన్నారు 12 వారాల బిల్లులు చెల్లించాల్సిన ప్రభుత్వం ఇంతవరకూ స్పందించక పోవడం వల్ల రోజుకో పర్యాయం సచివాలయాల ఎదుట ఉపాధి వేతనదాలరుతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. ఉపాధిహామీ చట్ట ప్రకారం పనిచేసిన 2 వారాలకే బిల్లులు చెల్లించాలని మార్గదర్శకాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. బకాయి బిల్లులు చెల్లించే వరకూ ఆందోళన కార్యక్రమాలు దశలవారీగా జరుగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు లక్ష్మణరావు, చుక్క గణేష్, రామినాయుడు, పార్వతి, చిన్నమ్మి, రామలక్ష్మి, పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: ఉపాధి వేతనదారులకు బిల్లులు చెల్లించాలని, పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెదపెంకిలో ఉపాధిపనులు కల్పించాలని, ఎన్ఎంఎంఎస్ యాప్ రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ వేతనదారులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో సీపీఎం సీనియర్ నాయకుడు మన్మథరావు, వ్యవసాయం కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటస్వామిలు పాల్గొని మాట్లాడుతూ పెదపెంకిలో సువర్ణ బందలో గత వారం 8గ్రూపులకు చెందిన సుమారు 300మంది పనిచేశారని దానికి సంబంధించిన మస్టర్ కార్యాలయానికి ఇస్తే పేమెంట్ జనరేట్ చేయకుండా రిజక్ట్ చేశారని దీనివల్ల వేతనదారులు నష్టపోతున్నారన్నారు. అదేవిధంగా రెండుపూటలా పనులు కాకుండా ఒంటిపూటే పని ఏర్పాటు చేయాలని, 200రోజులు ఉపాధిపనులు కల్పించి, కనీస వేతనం రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అరుణ పతాకావిష్కరణ



సీపీఐ ఎంఎల్ పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

పాలకొండ రూరల్: విప్లవ రథసారథి కామ్రేడ్ లెనిన్ 155వ జయంతి సందర్భంగా సీపీఐ ఎంఎల్ పార్టీ 55వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా పార్టీ అరుణ పతాకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. పాలకొండ మండలం బర్నసీతంపేటలో జిల్లా పార్టీ నాయకులు పేడారపు భాస్కరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండల కార్యదర్శి బిడ్డిక నాగేశ్వరరావు, జిల్లా నాయకులు నిమ్మక ఆదినారాయణ, బిడ్డిక సత్యంతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడివెనుక రాజకీయ ఒత్తిడి లేదా?

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన బంటువానివలసలో నిర్మించుకున్న ఇంటిగోడలు, చెట్లను ఆదివారం పోలీసులు, తహసీల్‌ద్రార్ సమక్షంలో కూల్చివేయడం దాడి వెనుక రాజకీయ ఒత్తిడి లేదంటారా? అని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ ఒత్తిడి కారణంగానే రెవెన్యూ అధికారులు, పోలీసులు నిర్వాసితుల భూములపై బుల్డోజరుతో దాడి చేశారన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల చర్యలను అడ్డుకునే ప్రయత్నం చేసిన నిర్వాసితులపై బైండోవర్ కేసులు నమోదు చేశారన్నారు. ఈ దాడిపై చర్య తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌కు ఒక వ్యక్తి వచ్చి కూల్చివేత ప్రక్రియ చట్టబద్ధంగానే జరిగిందని, ఎమ్మెల్యే విజయచంద్రకు ఎలాంటి సంబంధంలేదని పేర్కొనడం ఎంతవరకు సమంజసమన్నారు.

కూల్చివేత ప్రక్రియలో ఎమ్మెల్యే పాత్రపై సంబంధిత ఎమ్మెల్యే ఖండించాల్సి ఉన్నప్పటికీ ఆత్మరక్షణలో భాగంగా గానే ఎమ్మెల్యే పాత్రపై ఒక సాధారణ వ్యక్తి ఖండించాడన్నారు. కబ్జాకు సంబంధించి తహసీల్దార్, ఆర్‌డీఓ స్థాయి అధికారులు తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు.

అందుబాటులో నవధాన్యాల కిట్లు



లుంబూరు రైతు సేవా కేంద్రంలో నవధాన్యాల మిశ్రమం తయారీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాలకొండ రూరల్: పాలకొండ మండలం లుంబూరు రైతు సేవా కేంద్రం పరిధిలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్) కింద నవధాన్యాల కిట్లు మంగళవారం సిద్ధం చేశారు. ఈ కిట్లలో 9 రకాల విత్తనాలను కలిపి 3 కిలోల ప్యాకెట్లగా తయారు చేసి ఈ సీజన్‌లో రైతులకు ఆందుబాటులో ఉంచారు. వీటితో పాటు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ 4 కిలోలు, కట్టెలు 4 కిలోలు, పిల్లిపెసర 2 కిలోలు కలిపి 10 కేజీల ప్యాకెట్లు రైతులకు సబ్సిడీతో అందించడానికి సిద్ధంగా ఉంచారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి : పీఓ

పాలకొండ రూరల్: ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్య రక్షణపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం బడ్డుమాసింగి ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన పీఓ అక్కడి విద్యార్థినిలకు అందుతున్న సేవలు, వసతులపై ఆరా తీశారు. ఈ క్రమంలో విద్యార్థులకు చేపడుతున్న వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. వారి భద్రతపై అవసరమైన చర్యలు చేపట్టాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అనతంరం ఎం.సింగుపురం పీహెచ్‌సీని సందర్శించి, అక్కడి రికార్డులు, అందుబాట్లో ఉన్న మందుల వివరాలు వైద్యాధికారి రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

నవధాన్యాల విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



నవధాన్యాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

సీతంపేట: నవధాన్యాల విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మన్మథరావు తెలిపారు. కుశిమిగూడలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీటిని మంగళవారం ప్రదర్శించారు. రైతులకు పంపిణీ చేశారు. నవధాన్యాల వల్ల పంట భూమి ఆరోగ్యంగా ఉండి నేల సారవంతంగా ఉంటుందన్నారు. సేంద్రీయ కర్బనం పెరుగుతుందన్నారు. రసాయన మందులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఏఓ విమల, ముసలయ్య, ఎం.నరేష్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మలేరియా కేసులు గుర్తించాలి



మాట్లాడుతున్న జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సకాలంలో మలేరియా కేసులను గుర్తించాలని, అప్పుడే త్వరితగతిన చికిత్స అందజేసి ప్రాణాలు కాపాడడం జరుగుతుందని జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాదరావు అన్నారు. కురుపాం మండలంలోని వెలుగు కార్యాలయంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా మలేరియా కేసులు ఉన్నట్లయితే వెంటనే ఆస్పత్రికి తరలించి, వైద్యం అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి, జిల్లా మలేరియా కన్సల్టెంట్ అధికారి జి.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

పాలకొండ: పాలకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి సారా రవాణ జరుగుతన్న విషయమై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అన్ని ప్రధాన రహదారులతో పాటు ఏజెన్సీ గ్రామాల నుంచి సారా రవాణాకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో దారి కాపల ఏర్పాటు చేశామని తెలిపారు. పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని వివరించారు. బెల్లం వ్యాపారులకు ఇప్పటికే అవగాహన కల్పించి తగిన సూచనలు చేశామన్నారు. సారా తయారీ, రవాణా చేసేవారు తమ తీరు మార్చుకోకపోతే పీడీ యాక్టు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు.

ముగిసిన శిక్షణ



విద్యార్థులు సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి లక్ష్మణరావు

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిత్యజీవితానికి అన్వయించుకుని, ఉపయోగపడేలా చూసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు అన్నారు. సమాజ సమస్యలు పరిష్కరించే ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్, సీఎస్ఐఆర్–ఎస్ఈఆర్‌సీ సంస్థలు సహాయం చేస్తున్నాయన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల్లో ఎరువు తయారు చేయాలి



చినగుడబలో క్లాప్‌మిత్రలకు సూచనలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ, వల్లరగుడబ గ్రామాల ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)లను ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం చెత్త నుంచి ఎరువుల తయారీపై క్లాప్‌మిత్రలకు అవగాహన కల్పించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయాలని, అదే ఎరువును రైతులకు సబ్సిడీపై అందిస్తున్న పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చవచ్చన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు పండిస్తే పంటలు బాగా పండడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని అలాగే నేల సారవంతమవుతుందన్న విషయాలను అందరికీ తెలియజేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఆర్.గోవిందరావు, కార్యదర్శి టి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.